క్లుప్తంగా

ట్రాఫిక్ స్టేషన్‌కు కొత్త వాహనం



కొత్త వాహనాన్ని ఎస్పీ శివకిషోర్‌కు అందిస్తున్న యాజమాన్యం

ఏలూరు టౌన్: ఏలూరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు నూతన బొలెరో వాహనం వచ్చింది. జిల్లా ప్రధాన కార్యాలయం వద్ద శనివారం ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్‌కు బొలెరో కారును గుప్తా ఫౌండేషన్ యాజమాన్యం ఎమ్మెల్యే బడేటి చంటి సహకారంతో అందజేసింది. ఈ సందర్భంగా ఎస్పీ శివకిషోర్ మాట్లాడుతూ ఏలూరు నగరంలో ట్రాఫిక్ నియంత్రణను మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు దోహదపడుతుందని అన్నారు. ఎమ్మెల్యే సహకారంతో రోడ్డు అక్రమణలు తొలగించామన్నారు. నగరంలో సీసీ టీవీ కెమెరాల ఏర్పాటుకు ఎమ్మెల్యే సహకించాలని కోరారు. గుప్తా ఫౌండేషన్ సేవలు అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ లక్ష్మణరావు, ఎస్‌బీ సీఐ మల్లేశ్వర రావు, ఆర్‌ఐ పవన్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ పార్థసారథి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

15న విజయవాడలో ధర్నాకు తరలిరండి

దెందులూరు: భవన నిర్మాణ కార్మికుల అభివృద్ధి, సంక్షేమం, స్వయం ఉపాధి కాపాడుతామని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ అమలు కోరుతూ ఈ నెల 15న విజయవాడలో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు, ఏలూరు టౌన్ ప్రెసిడెంట్ కాకర్ల శ్రీను కోరారు. శనివారం మాదేపల్లిలో ఆయన మాట్లాడుతూ దేశంలో అనేక రాష్ట్రాల్లో కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రతి కార్మికుడి పై ముగ్గురు నలుగురు కుటుంబ సభ్యులు ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, మన రాష్ట్రంలో కూడా కార్మికుల వెల్ఫేర్ బోర్డ్ ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయాలని శ్రీను డిమాండ్ చేశారు.

ఆర్‌ఎస్‌ఎస్ కవాతు



కవాతు నిర్వహిస్తున్న కార్యకర్తలు

ఏలూరు (టూటౌన్): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) ఆధ్వర్యంలో రెండు రోజులపాటు ఏలూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఘోష్ (బ్యాండ్) శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా వన్‌టౌన్ పరిధిలో సాయంత్రం కవాతు నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖులు పాల్గొన్నారు.

కూటమికి రెడ్ సిగ్నల్

- రేటు కుదరక బ్లాక్‌మెయిల్
- బార్లకు టెండర్లు వేయని వైనం
- ఏలూరులో 4 బార్లకే అనుమతులు



ఏలూరులోని ఎక్సైజ్ శాఖ కార్యాలయం (ఫైల్)

ఏలూరు టౌన్: మద్యాన్ని ఏరులై పారిస్తూ, ప్రజలను మద్యానికి బానిసలుగా చేసేందుకు కూటమి సర్కారు కుయుక్తి పన్నాగాలు చేసింది. ఒక వైపు ప్రైవేటు వ్యక్తులకు మద్యం షాపులను ఇవ్వటం, బెల్టు షాపులను సైతం పెట్టుకునేలా ప్రోత్సహించటంతో 24 గంటలూ మద్యం అందుబాటులోకి వచ్చింది. ఇదే అదనుగా ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి నూతన బార్ పాలసీని తెచ్చింది. బార్ లైసెన్సు ఫీజును తగ్గిస్తూ మద్యాన్ని మరింత ఎక్కువగా విక్రయించేందుకు ప్లాన్ చేసింది. కానీ తమ పన్నాగం పారకపోవటంతో ఏమి చేయాలో తెలియని సందిగ్ధంలో ప్రభుత్వ పెద్దలు ఉన్నారనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

కూటమి నేతలకే నచ్చని వైనం

నూతన బార్ పాలసీతో భారీ ఎత్తున ఆదాయాన్ని ఆర్జించాలనే కూటమి ప్రభుత్వ ఎత్తుగడలను తమ కూటమి నేతలే చిత్తుచేశారనే అపవాదు బలంగా ఉంది. కూటమి ప్రభుత్వం వస్తే భారీగా మద్యం విక్రయాలు చేస్తూ జేబులు నింపుకోవాలనే కూటమి మద్యం వ్యాపారుల ఆశలు ఫలించగా, బార్ పాలసీతో రెడ్ సిగ్నల్ పడింది. అతి తక్కువ ధరకే బార్లను సొంతం చేసుకోవాలనే కూటమి నేతలకు ప్రభుత్వ విధానం నచ్చలేదంటున్నారు. ఏలూరు నగరంలో బార్ లైసెన్సుకు ఏడాదికి రూ.55 లక్షలు చెల్లించాల్సి ఉంది. కానీ అనూహ్యంగా మద్యం వ్యాపారులు ఎవరూ బార్ లైసెన్సుకు ఆసక్తి చూపించకపోవటం గమనార్హం.

టెండర్లు నిల్

ఏలూరు నియోజకవర్గంలో గతంలో 10 బార్లు ఉండగా, తాజాగా రెండు పెంచటంతో 12 బార్లకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆగస్టు నెలలో 28న టెండర్లను తీసి లాటరీ విధానంలో బార్ షాపులను కేటాయిస్తామని ఎక్సైజ్ అధికారులు ప్రకటించారు. కానీ అనూహ్యంగా కేవలం 3 ఓపెన్, ఒకటి కల్లుగీత కులాలకు కేటాయించిన షాపుకు మాత్రమే టెండర్లు పడ్డాయి. ఏమి చేయాలో తెలియక ఎక్సైజ్ అధికారులు మ...మా.. అనిపించేశారు. ఏలూరులో మరో 8 బార్లకు మరోసారి లైసెన్సులు కోసం టెండర్లు వేసుకునేందుకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఈనెల 16 తేదీ వరకు టెండర్లు వేసేందుకు గడువు విధించారు. కానీ నేటికీ ఒక్క టెండరు దాఖలు కాకపోవటం విశేషం. మద్యం వ్యాపారులంతా సిండికేట్‌గా మారిపోవటంతో కావాలనే బార్‌లకు దరఖాస్తు చేయటం లేదని అంటున్నారు. మరో వైపు కూటమి ప్రభుత్వాన్ని బ్లాక్‌మెయిల్ చేస్తూ టెండర్లు వేయకుండా మద్యం సిండికేట్ అడ్డుపడుతుందనే వాదన వినిపిస్తోంది.

రింగైన వ్యాపారులు

ఏలూరు నగరంలో ఇప్పటి వరకూ 10 బార్లు ఉండగా, ఎప్పుడూ ఇంత దారుణమైన పరిస్థితి ఎదురుకాలేదనే చర్చ జోరుగా సాగుతోంది. కూటమి ప్రభుత్వం ఏలూరులో 12 బార్లకు అనుమతి ఇస్తే, నాలుగు బార్లకు మాత్రమే ప్రస్తుతం అనుమతి ఉంది. మరో 8 బార్లకు ఒక్క టెండర్ పడలేదు. ఏలూరులో ఇలాంటి విచిత్రమైన పరిస్థితి లేదని, మద్యం వ్యాపారులు రింగై, కావాలనే టెండర్లు వేయకుండా నిలువరిస్తున్నారా? అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

దరఖాస్తు చేసుకోవాలి



ఏలూరు నగరంలో 12 బార్లకు లైసెన్సులు ఇచ్చేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. తొలి విడతలో నాలుగు బార్లకు మాత్రమే దరఖాస్తులు రాగా, జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీలత ఆధ్వర్యంలో లాటరీ విధానంలో బార్ షాపులు కేటాయిస్తూ అనుమతులు మంజూరు చేశాం. ఏలూరులో మరో 8 బార్లకు మరోసారి నోటిఫికేషన్ ఇచ్చాం. ఈనెల 16 తేదీ వరకు టెండర్లు దాఖలు చేసేందుకు అవకాశం ఉంది.

– ఎ.అవులయ్య, ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి

బాల్య వివాహాలను అరికడదాం



బాల్య వివాహాలపై అవగాహన ప్రదర్శన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): బాల్య వివాహాలను అరికట్టి, బాలికల ఆరోగ్య పరిరక్షణకు తల్లిదండ్రులు ముందుకు రావాలని చైల్డ్‌రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ (క్రాఫ్) జిల్లా కోఆర్డినేటర్ ఆర్ వినోద్ కుమార్ అన్నారు. స్థానిక శనివారపు పేట శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానంలో గ్లోబల్ ఇంటర్ ఫెయిత్ ప్లెడ్జ్ వీకెండ్ టు ఎండ్ చైల్డ్ మ్యారేజ్ అనే అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ సనాతన ధర్మం మనకు బాల్యం, పెరుగుదల, ఆధ్యాత్మిక అభివృద్ధి కోసం ఉద్దేశించిందని తెలిపారు. బ్రహ్మచర్య ఆశ్రమం తర్వాత మాత్రమే గృహస్థ ఆశ్రమం వస్తుందని, వివాహం విద్య, పరిపక్వతను అనుసరించాలని సూచిస్తోందన్నారు. బాల్య వివాహం ఈ పవిత్ర కార్యక్రమాన్ని ఉల్లంఘిస్తోందని, బాధలను కలిగిస్తుందని, యుక్త వయసు రాకముందే ఏ బిడ్డను వివాహ వ్యవస్థలోనికి నెట్టకుండా చూసుకుందామని అన్నారు. జిల్లాని, ఏలూరు నగరాన్ని బాల్య వివాహ రహిత నగరంగా తయారు చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని, బాల్య వివాహం పట్ల భక్తులకు, అర్చకుడు హయగ్రీవాచార్యులు పూర్తి అవగాహన కలిగించారు.

ఏలూరులో ఇఫ్టూ రాష్ట్ర శిక్షణ తరగతులు

ఏలూరు (టూటౌన్): నవంబర్ 1, 2, 3, 4 తేదీల్లో ఇఫ్టూ రాష్ట్రస్థాయి తరగతులు ఏలూరులో జరగనున్నాయని సంఘ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వెంకట్రావు, ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక మార్కెట్ యార్డులో వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. దేశంలో మోదీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నామని, వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నామని వారు తెలిపారు.

దివ్యాంగుల అభ్యున్నతికి కృషి అభినందనీయం



కేక్ కట్ చేస్తున్న డిప్యూటీ కలెక్టర్ సత్యనారాయణ

ఏలూరు (టూటౌన్): గత 38 సంవత్సరాలుగా దివ్యాంగుల అభ్యున్నతికి కృషి చేయడం అభినందనీయమని డిప్యూటీ కలెక్టర్ జీవీవీ సత్యనారాయణ అన్నారు. ఏలూరులోని దొండపాడులో గల పరివర్తన్ బధిరుల పాఠశాలలో ఉమా ఎడ్యుకేషనల్ – టెక్నికల్ సొసైటీ నిర్వహించిన 38వ ఆవిర్భావ దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దాదాపు 200 మంది సిబ్బందితో వేలాది మంది దివ్యాంగులకు సేవలందిస్తూ, అవసరమైన వారికి కృత్రిమ అవయవాలు, హియరింగ్ ఎయిడ్స్, ట్రై సైకిళ్లు, చక్రాల కుర్చీలు వంటివి అందించి వారి జీవితాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుండటం అభినందనీయమని అన్నారు. వ్యవస్థాపకుడు ఎస్‌పీ రెడ్డి మాట్లాడుతూ సంస్థ చేసిన సేవలకు గుర్తింపుగా 2003లో అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం నుంచి ఉత్తమ సంస్థగా రాష్ట్రపతి అవార్డు, 2019లో మరోసారి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నుంచి అవార్డుతో పాటు ఐదు జాతీయ అవార్డులను తమ సంస్థ అందుకుందని వివరించారు. కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్ డి.శ్రీనివాసరెడ్డి, పాఠశాల సిబ్బంది ప్రత్యేక డీఎడ్ కళాశాల సిబ్బంది, డీడీఆర్‌సీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

22 నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు



ఉత్సవాల కరపత్రం విడుదల చేసిన దృశ్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఈ నెల 22 నుంచి స్థానిక అంబికా దేవి ఆలయంలో శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు అంబికా సంస్థల డైరెక్టర్ అంబికా ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు కరపత్రాన్ని శనివారం రాత్రి స్థానిక అంబికా దేవి ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మిక కర్త ఎస్ అనంత లక్ష్మి విడుదల చేశారు. అమ్మవారు అంబికా దేవి రూపంలో ఉన్న ఆలయం దేశంలో ఇదొక్కటేనని చెప్పారు. ఈ ఆలయంలో ఈ ఏడాది 20వ వార్షిక శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అంబికాదేవి ఆశీస్సులు నగర ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. అర్చకుడు వారణాసి శ్రీ రాఘవేంద్ర శర్మ మాట్లాడుతూ ఈ ఏడాది శరన్నవరాత్రి మహోత్సవాలు 10 రోజుల పాటు నిర్వహిస్తామని, ఈ రోజుల్లో అమ్మవారు విశేష అలంకరణల్లో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. నిత్యం ఉదయం ప్రాతఃకాల శ్రీచక్ర ఆరాధన, శ్రీ బాలా మూలమంత్ర, చండీ మూల మంత్ర, అవతార మూలమంత్ర సహిత హోమం, శ్రీచక్ర అభిషేకం, కుంకుమార్చనలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సత్యవాడ దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయాలలో పనిచేసి పదవీ విరమణ చేసిన తమకు చెల్లించాల్సిన బకాయిలను తక్షణం చెల్లించాలని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయాల విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కే. కామయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం యూటీఎఫ్ కార్యాలయంలో మాట్లాడుతూ 2020 నుంచి ఇంతవరకు 550 మంది పదవీ విరమణ పొందారని, వీరికి రావాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఎరియర్స్ నేటికీ చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 65 మంది విశ్రాంత ఉద్యోగులు రిటైర్మెంట్ బెనిఫిట్స్ పొందకుండానే చనిపోయారన్నారు. 2014 నుంచి మెడికల్ బిల్లులు నేటికీ చెల్లించలేదని విమర్శించారు.

సైబర్ నేరగాళ్లతో తస్మాత్ జాగ్రత్త !

- ఏపీకే ఫైళ్లను ఓపెన్ చేయొద్దు
- మోసానికి గురైతే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయండి



కుక్కునూరు పాఠశాలలో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కుక్కునూరు: ప్రపంచం మొత్తం సెల్‌ఫోన్ వినియోగించనిదే ఏ పని జరగని పరిస్థితి నేడు ఉంది. ఏజెన్సీ ప్రాంతాల్లోని మారుమూల పల్లెల్లో ఒకే ఇంట్లో రెండు, మూడు సెల్‌ఫోన్‌లు వినియోగించేలా ప్రజల జీవితాల్లోకి సెల్‌ఫోన్ చొచ్చుకుపోయింది. ప్రజలు సౌకర్యవంతంగా ఇంట్లో ఉండే తమ పనులు చక్కబెట్టుకునేలా ఆన్‌లైన్ బ్యాంకింగ్, షాపింగ్, గేమింగ్ ఇలా ఒక్కటేమిటి ప్రతీదీ సెలఫోన్ ద్వారానే చేసుకునేలా టెక్నాలజీ అభివృద్ధి చెందింది. సెల్ ఫోన్‌తో ఎంత సౌకర్యంగా ఉందో అంతేస్థాయిలో మోసపోయే ప్రమాదమూ పొంచి ఉంది. రోజుకో తీరులో సైబర్ మోసగాళ్లు రెచ్చిపోతున్నారు. సెల్‌ఫోన్ లేకుంటే క్షణం కూడా గడవని ఈ రోజుల్లో ఇదే సెల్‌ఫోన్ ద్వారా సైబర్ నేరగాళ్లు రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. మహిళలు, టెక్నాలజీపై అవగాహన లేని వారు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కి తమ ఖాతాల్లో సొమ్మును ఖాళీచేసుకుంటున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

కుక్కునూరు మండలంలో ఇలా..

సైబర్ నేరగాళ్ల మోసం పట్టణాల నుంచి ఏజెన్సీలోని మారుమూల పల్లెలకూ పాకింది. ఇటీవల కుక్కునూరు మండలానికి చెందిన ఓ యువకుడు తన సెల్‌ఫోన్‌కు ఆన్‌లైన్ టాస్క్‌లు పూర్తి చేసి సంపాదించండని వచ్చిన మేసేజ్ చూసి సైబర్ కేటుగాళ్ల వలలో చిక్కి రూ.2 లక్షలు పోగొట్టుకున్నాడు. మరో యువకుడు లోన్ యాప్ ద్వారా రూ.1 లక్ష సమర్పించుకున్నాడు. కొండపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళకు ఫోన్ చేసిన కేటుగాళ్లు ప్రభుత్వ స్కీమ్‌కు సంబంధించి డబ్బులు జమకావాలంటే ఫోన్‌పేకు పంపించిన లింక్‌ను క్లిక్ చేస్తే స్కీమ్‌కు సంబంధించిన డబ్బులు ఖాతాలో జమవుతాయని చెప్పడంతో ఆ మహిళ ఓ వ్యాపారి వద్దకు వెళ్లి అతని ఫోన్ పే నుంచి లింక్‌ను క్లిక్ చేయించడంతో సుమారు రూ.30 వేలకు పైగా కొల్లగొట్టారు. ఇలా మరెన్నో ఘటనలు ఉన్నాయి. ఓ యువకుడి సెల్‌ఫోన్‌ను హ్యాక్ చేసి అతని ఫొటోలను మార్ఫింగ్ చేసి బెదిరించినటువంటి ఘటనలూ ఉన్నాయి.

హ్యాక్ అవుతున్న ఫోన్లు

ఇటీవల సోషల్ మీడియాలో సైబర్ నేరగాళ్లు ఆండ్రాయిడ్ అప్లికేషన్ ప్యాకేజీ లేదా ఆండ్రాయిడ్ ప్యాకేజీ కిట్ (ఏపీకే) ఫైళ్లను వాట్సప్ ద్వారా పంపతున్నారు. వాటిని ఓపెన్ చేసి ఓకే అని క్లిక్ చేసేవారి ఫోన్లు హ్యాక్ అవుతున్నాయి. ఫోన్ నియంత్రణ సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళ్తోంది. ఈ విషయం తెలియని వారు డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా సొమ్ము పంపితే వెంటనే సైబర్ నేరగాళ్లు పిన్ నంబర్ తెలుసుకోని నిమిషాల్లో బాధితుడి బ్యాంక్ ఖాతాలోని నగదు కాజేస్తున్నారు. నేరగాళ్లు ఆ ఫోన్‌లోని కాంటాక్ట్ నెంబర్‌లకు ఏపీకే ఫైళ్లను పంపుతున్నారు. తమకు తెలిసిన వ్యక్తి నుంచి మేసేజ్ వచ్చిందని భావించిన ఇతరులు ఆ ఏపీకే ఫైళ్ల లింక్‌ను ఓపెన్ చేయడంతో ఖాతాలో సొమ్ము కోల్పోతున్నారు. పీఎం కిసాన్ యోజన, ఎస్‌బీఐ రివార్డ్స్, ఆర్‌టీఏ ఈ చలాన్ తదితర లింకుల పేరిట మేసేజ్‌లు పంపుతూ బ్యాంకు ఖాతాల నుంచి నగదు లాగేస్తున్నారు.

ఆగని ఘటనలు

సైబర్ మోసాలపై ప్రభుత్వాలు వివిధ రకాలుగా ప్రచారం చేస్తూ అవగాహన కల్పిస్తున్నప్పటికీ సైబర్ మోసాలు ఆగడం లేదు. ప్రతి రోజు ఏదో ఒకోట సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కి సొమ్ము పోగొట్టుకున్న ఘటనలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి.

అప్రమత్తంగా ఉండాలి



అప్రమత్తతోనే ఆన్‌లైన్ మోసాలకు అడ్డుకట్ట వేయవచ్చు. ప్రధానంగా ఏపీకే ఫైల్స్ పంపి వాటిని ఓపెన్ చేస్తే ఉన్న సొమ్మంతా మాయం చేస్తున్నారు. ఉద్యోగాలిప్పిస్తామని లింక్‌లు పంపించి ఆ తరువాత సొమ్ము రాబట్టి మోసం చేస్తున్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలి. లేదా సమీప పోలీస్‌స్టేషన్‌కు సంప్రదించాలి.

– కొవ్వూరి రాజారెడ్డి, ఎస్సై, కుక్కునూరు

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	24	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	28	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	38	బిళ్లచిక్కుడు	00
వంకాయలు (తెలుపు)	40	చామదుంపలు	36
బెండకాయలు	20	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	48	కంద	00
కాకర కాయలు	36	బీట్‌రూట్	38
బీరకాయలు	30	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	38	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	26	అల్లం	76-90
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	40	పాలకూర	10
బంగాళదుంపలు	34	తోటకూర	10
ఉల్లిపాయలు	25	చుక్కకూర	10
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	26	పుదీనా	05
అనబకాయ (1)	20	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20	చిలకదదుంప	48

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	14
ఏలూరు – జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	29
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	22
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	00
ఏలూరు – అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	18
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.15	4822	14
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	06
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	05
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	16
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	10
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	16
ఏలూరు – తిరుపతి	16.00	4830	32

సంక్షిప్తం

క్రీడాకారిణికి ఆర్థిక ప్రోత్సాహకం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జాతీయ మహిళా ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారిణి అనపర్తి సాయిమాధురికి స్థానిక మాతృదేవోభవ సేవ ట్రస్ట్ ప్రతినిధులు రూ.5 వేల ఆర్థిక ప్రోత్సాహకం శనివారం అందజేశారు.

81 మందికి ఉచిత వైద్య పరీక్షలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామకోటి ప్రాంగణంలో శనివారం నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరంలో 81 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి, అవసరమైనవారికి మందులు ఇచ్చారు. ఆయుర్వేద వైద్యుడు నగేష్ బృందం ఈ పరీక్షలు చేశారు.

ఉచిత వైద్య శిబిరం

ఏలూరు (టూటౌన్): స్థానిక ఆర్‌ఆర్‌పేటలోని శ్రీకృష్ణ ఆస్పత్రిలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో 133 మందికి వైద్య పరీక్షలు చేశారు. డాక్టర్ బి.కృష్ణ ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించారు.

బాధితులను ఆదుకోవాలి

ఏలూరు (టూటౌన్): మణిపూర్ బాధితులను అన్ని విధాలుగా కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని జాతీయ దళిత జేఏసీ చైర్మన్ పెరికె వరప్రసాదరావు శనివారం ఒక ప్రకటనలో కోరారు. మణిపూర్‌లో చనిపోయిన గిరిజన క్రైస్తవులకు రూ.కోటి చొప్పున పరిహారం ప్రకటించాలని, పునరావాసం కల్పించాలని పేర్కొన్నారు.

జీవనోపాధికి ఒకేషనల్ విద్య దోహదం

గణపవరం: ఒకేషనల్ విద్య జీవనోపాధికి దోహదపడుతుందని, విద్యార్థులు విద్యతోపాటు జీవనోపాధికి దోహదపడే విషయాలపై అవగాహన కలిగి ఉండాలని గణపవరం ఎంఈఓ గొర్రెల బాలయ్య అన్నారు. ఆయన హైస్కూల్‌లో ఒకేషనల్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులకు ఒకేషనల్ విద్య ద్వారా వారికి ఆసక్తి ఉన్న విషయాలపై శిక్షణ పొందవచ్చునని, తద్వారా జీవితంలో వారు సొంత కాళ్లపై నిలబడే అవకాశం ఉందని అన్నారు. విద్యార్థులకు ప్రతి వారం క్షేత్రస్థాయి పర్యటనకు తీసుకెళ్లి, వారికి వివిధ వ్యాపారాలు, వృత్తులు, పరిశ్రమల గురించి అవగాహన కల్పించాలని, ఆయా విషయాలలో మెళకువలు నేర్పించాలని సూచించారు. హెచ్‌ఎం తోట సింహాద్రి అప్పారావు మాట్లాడుతూ ఒకేషనల్ విద్యలో భాగంగా విద్యార్థులను వారానికి ఒకరోజు క్షేత్రస్థాయి పర్యటనకు తీసుకెళ్లి, వివిధ వ్యాపారసంస్థల అమ్మకాలు, కొనుగోళ్లకు సంబంధించిన లావాదేవీలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

రేపటి నుంచి పశువులకు వ్యాక్సిన్లు



వ్యాక్సిన్లు వేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం / జంగారెడ్డిగూడెం: పశువులకు 7వ విడత జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ వ్యాక్సిన్లు నూజివీడు పశువైద్య డివిజన్ పరిధిలోని కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం మండలాల్లో ఈ నెల 15 నుంచి అక్టోబర్ 15 వరకు నెల రోజుల పాటు వేయనున్నట్టు పరింపూడి పశువైద్య అధికారి బీఆర్ శ్రీనివాస్, జంగారెడ్డిగూడెం ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు పీఎస్‌వీ శేఖర్‌దొర శనివారం తెలిపారు. మూడు నెలలు వయసు దాటిన ప్రతి గోజాతి, గేదజాతి పశువులకు టీకాలు వేయనున్నట్టు పేర్కొన్నారు. కొయ్యలగూడెం మండలంలో 22,218 పశువులకు వ్యాక్సిన్లు వేస్తామని తెలిపారు. పరింపూడిలో ఈ నెల 15, 16, 17 తేదీల్లో, పొంగుటూరు, దిప్పకాలయపాడులో 16, 17, 18, చొప్పరామన్నగూడెం 18, కన్నాపురంలో 19, 20, 22, ఏడువాడలపాలెం 19, గవరవరం 20, కనకాద్రిపురం 22, కన్నాయిగూడెం, మహదేవపురంలో 23, కుంతలగూడెం, రాజవరంలో 24, 25, మంగపతిదేవీపేటలో 24, యర్రంపేటలో 26, 27, 29, బయ్యన్నగూడెంలో అక్టోబర్ 1, 3, 4, 6, 7, రామానుజపురంలో 8, 9, సరిపల్లిలో 10, వేదాంతపురంలో 11, 13 తేదీల్లో టీకాలు వేస్తారని వివరించారు.

- జంగారెడ్డిగూడెం మండలంలో 24,822 పశువులకు వ్యాక్సిన్లు వేయనున్నట్టు తెలిపారు. జంగారెడ్డిగూడెంలో 15, 16, 17 తేదీల్లో, తిరుమలాపురం 18, 19, 20, 22, అక్కంపేట 18, ఎ.పోలవరం 19, 20, మాతన్నగూడెం 22, మైసన్నగూడెం 23, 24, పట్టెన్నపాలెం, పుల్లేపూడి 24, శ్రీనివాసపురం 25, 26, 27, తాడువాయి 30, అక్టోబర్ 1, 3, పంగిడిగూడెం 3, 4, వేగవరం 4, 6, 7, గుర్వాయిగూడెం 6, 7, చక్రదేవరపల్లి 8, 9, 10, కేతవరం 8, 9, లక్కవరం 10, 11, 12, దేవులపల్లి 11, అమ్మపాలెం 13, నిమ్మలగూడెం 14వ తేదీన టీకాలు వేయనున్నట్టు వివరించారు. మూడు బందాలు నిర్దేశిత గ్రామాల్లో వ్యాక్సినేషన్ కార్యక్రమంలో పాల్గొంటాయని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు పశు వైద్యశాలల వద్ద పశువులకు టీకాలు వేశామని శ్రీనివాస్ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ వితరణ

వేలేరుపాడు: అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన మహిళలకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో శనివారం సాయం అందించారు. రేపాకగొమ్ము గ్రామంలో కారం బాయమ్మ ఇల్లు దగ్ధమై నిరాశ్రయులైంది. బాయమ్మ కుటుంబానికి వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రూ.7 వేలు, వంట సామగ్రి, నిత్యావసరాలను అందజేశారు.